సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం, 16, సెప్టెంబర్, 2022

లంబసింగిలో సినిమా షూటింగ్ సందడి



చింతపల్లి: ఆంధ్రాకశ్మీర్ లంబసింగిలో గురువారం సినిమా షూటింగ్ జరిగింది. సీనియర్ నటుడు చలపతిరావు కుమారుడు రవిబాబు ప్రతినాయకుడిగా నూతన నటీనటులతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. మరో వారం రోజులపాటు ఈ ప్రాంతంలో షూటింగ్ నిర్వహించనున్నారు. గురువారం వారపుసంత కావడంతో షూటింగ్ చూసేందుకు గిరిజనులు అధిక సంఖ్యలో వచ్చారు.

నేడు గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సాక్షి, పాడేరు : జిల్లాలోని పాడేరు డివిజన్‌లో కేజీబీవీల్లో ఖాళీగాఉన్న గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి ఈ నెల 16న కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు డీఈవో పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 10గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే డెమో టీచింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు

న్యూస్‌రీల్

రంగురాళ్ల క్వారీ వద్ద డ్రోన్‌తో నిఘా



డ్రోన్‌ను పరిశీలిస్తున్న పోలీసు, అటవీశాఖ అధికారులు

గూడెంకొత్తవీధి: మండలంలోని సిగినాపల్లి రంగురాళ్ల క్వారీ వద్ద డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేశారు. ఎస్పీ సతీష్ కుమార్, ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం పోలీసు, అటవీశాఖ ఆధ్వర్యంలో సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి, రేంజ్ అధికారులు సిగినాపల్లి, సంకాడ కొత్తూరు, దొడ్డిబంద గ్రామాల్లో ఈ నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించి, రంగురాళ్ల తవ్వకాలు జరిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని వారు తెలిపారు. రంగురాళ్ల తవ్వకాల జోలికి పోవద్దని సూచిస్తూ గ్రామాల్లో దండోర వేయించారు. పాడేరులో 16న జరిగే జాబ్‌మేళాకు హాజరై ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని కోరారు. రంగురాళ్ల తవ్వకాలు జరిపితే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతారని హెచ్చరించారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

అడ్డతీగల: ఒక సంవత్సర కాలపరిమితికి పని చేయడానికి పారా లీగల్ వలంటీర్ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు అడ్డతీగల జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ప్రవీర్ బాంజ్‌డియో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.18 సంవత్సరాలు నిండి, మెట్రిక్యులేషన్ లేదా దానికి సమానమైన అర్హత కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. పదవీ విరమణ చేసిన టీచర్లు,ఎంఎస్‌డబ్ల్యూ కోర్సు చదువుతున్నవారు,అంగన్‌వాడీ వర్కర్లు,డాక్టర్లు,న్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు,రాజకీయేతర సభ్యులు, గృహిణులు,సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఒక్కో మండలానికి 25 మంది వరకూ నియమించడానికి అవకాశం ఉందని చెప్పారు.జనన ధృవీకరణ, సామాజికసేవ పనులకు సంబంధించిన పత్రాలు జతచేసిన దరఖాస్తుపై ఇటీవల తీసిన పాస్‌పోర్ట్ ఫొటో అతికించి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి ఇవ్వాలన్నారు. దరఖాస్తులను ఈనెల 27 లోగా ఛైర్మన్,మండల లీగల్ సర్వీసెస్ కమిటీ,వైటీసీ భవనం,అడ్డతీగల వద్ద అందజేయాలని తెలిపారు.

మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి చర్యలు

రంపచోడవరం: గిరిజన ప్రాంతంలోని మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధిచెందే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో గురువారం వెలుగు ఏపీడీ, డీపీఎం, ఏపీఎం, కమ్యూనిటీ కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకం ద్వారా చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రతి మండలంలో పది మంది నుంచి, పెద్ద పరిశ్రమల కోసం ఇద్దరి నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.40వేల చొప్పున మంజూరు చేస్తామని, ప్రతి మండలంలో ఆసక్తి గల 25 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించాలని అధికారులకు తెలిపారు.

ఉపాధి ఏపీవో సస్పెన్షన్

రాజవొమ్మంగి: ఉపాధిహామీ పథకం ఏపీవో పి.నాగరాజును సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ ఎస్.రమేష్‌రామన్ ఉత్తర్వులు జారీ చేసినట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర గురువారం తెలిపారు. గిరిజన సంక్షేమశాఖకు సంబంధించి పార్ట్‌పేమెంట్ రూ.7లక్షలకు గాను పూర్తి బిల్లు రూ.42లక్షల మేర ఆన్‌లైన్ చెల్లింపుతో పాటు, విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని పీడీ తీవ్రంగా పరిగణించారన్నారు. ఈ విషయంపై మూడు రోజుల్లోగా సమాధానం చెప్పడంతో పాటు, మంజూరు చేసిన బిల్లులను సంబంధిత కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేయాలని నాగరాజును పీడీ ఆదేశించినట్టు ఆయన తెలిపారు.

25 లోగా తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు

సాక్షి,పాడేరు: జిల్లాలో రైతులంతా ఈ నెల 25వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జేసీ జె.శివ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,94,392 ఎకరాల సాధారణ విస్తీర్ణం ఉండగా ఇప్పటి వరకు 1,71,015 ఎకరాల పంటకు మాత్రమే ఈ-క్రాప్ నమోదు చేసినట్టు చెప్పారు. గ్రామ సచివాలయాల్లో వ్యవసాయ అసిస్టెంట్ల వద్ద ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం 12వ విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని, ఈ మేరకు రైతులంతా ఈ నెల 18వ తేదీలోగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని జేసీ పేర్కొన్నారు.

రిసార్టు.. రీస్టార్ట్

- ఆంధ్రా ఊటీ అభివృద్ధికి టూరిజం, ఐటీడీఏ ప్రణాళికలు
- రూ.2.50 కోట్లతో పూర్తి చేయనున్న రిసార్టు పనులు
- అరకులో రూ.64 లక్షలతో ట్రీ హట్స్ నిర్మాణం



అరకులోయలో ట్రీ హట్స్ నమూనాలు



లంబసింగిలో రిసార్టులు

సాక్షి, విశాఖపట్నం: మేఘాల్లో తేలియాడేలా పొగ మంచు ఓ వైపు... మంచు తుంపరుల పలకరింపు మరో వైపు.. మైమరిపించే చల్లగాలి ఇంకోవైపు... ఇవి ఆంధ్రా ఊటీలో నిత్యం కనిపించే దృశ్యాలు. పర్యాటకుల స్వర్గధామంగా కనిపించే లంబసింగి.. అరకులోయ ప్రాంతానికి పర్యాటకులు పోటెత్తుతుంటారు. అందుకే సందర్శకులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు పర్యాటక శాఖ, ఐటీడీఏ సంయుక్తంగా సన్నద్ధమవుతున్నాయి. ఆగిపోయిన రిసార్టు ప్రాజెక్టును పట్టాలెక్కించడంతో పాటు అడ్వెంచర్ అనుభూతిని అందించే ట్రీ హట్స్‌ను సిద్ధం చేస్తున్నాయి. రూ.2.50 కోట్ల వ్యయంతో లగ్జరీతో పాటు మధ్యతరగతి ప్రజలకు అవసరమయ్యే డీలక్స్ రూమ్‌లు, రెస్టారెంట్‌తో రిసార్టు పనులు ప్రారంభం కానున్నాయి. ట్రీ హట్స్ పనులు ఇప్పటికే మొదలయ్యాయి.

ఏజెన్సీ ప్రాంతాలైన అరకు, పాడేరులో విభిన్న పర్యాటక ప్రాంతాలు సందర్శకులను ముగ్ధమనోహరంగా పలకరిస్తుంటాయి. మైదాన ప్రాంతాలకు సుదూరంగా సముద్రమట్టానికి 3600 అడుగుల ఎత్తులో ఉండే లంబసింగికి శీతాకాలం వచ్చిందంటే చాలు ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు వాలిపోతారు. 250 మంది జనాభా ఉన్న ఆ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంటుంది. ఇక్కడ నడి వేసవిలో కూడా ఉష్ణోగ్రత 25 డిగ్రీలు దాటదు. లంబసింగి పర్యాటకుల కోసం ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) ప్రత్యేక ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. వారి కోసం కాటేజ్‌లతో పాటు రెస్టారెంట్‌ను అభివృద్ధి చేయనుంది.

నవంబర్ నాటికల్లా సిద్ధం

ఐదేళ్ల కిందట రూ.3.5కోట్లతో ప్రాజెక్టును ప్రారంభించారు. నిధులు, కార్మికుల కొరత, అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం, కరోనా మహమ్మారితో సహా వివిధ కారణాల వల్ల ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. లంబసింగిలో పర్యాటకుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఎలాగైనా ప్రాజెక్టు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. అందుకే అర్ధాంతరంగా నిలిపేసిన ప్రాజెక్టును నవంబర్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రధాన బ్లాక్ వద్ద ఉన్న 25,000 చదరపు అడుగుల స్థలాన్ని అధికారులు వినియోగిస్తున్నారు. మరో ఎనిమిది లగ్జరీ(వీఐపీ) సూట్, 3 డీలక్స్ కాటేజీలు నిర్మించనున్నారు. గతంలో ఉన్న వాటితో కలిపి మొత్తం 15 వరకు పర్యాటకులకు అందుబాటులో ఉండేలా నిర్మాణాలు చేపట్టనున్నారు. పూర్తిస్థాయి రెస్టారెంట్ కూడా ఏర్పాటు కానుంది.

ప్రకృతి నడుమ విహారం

అరకు అందాలను వీక్షించేందుకు పాడేరు ఐటీడీఏ అన్ని సౌకర్యాలతో సాధారణ ధరకే కాటేజీలు నిర్మిస్తోంది. పద్మాపురంతో పాటు కొత్తవలస వ్యవసాయ ప్రదర్శన క్షేత్రంలో ఈ ట్రీ హట్స్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పాడేరు ఐటీడీఏ పరిధిలో డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు జలతరంగిణి వద్ద, అరకులోయ మండలంలోని పెదలబుడు, అరకులోయలో గోస్తని పేరిట ట్రీ హట్స్ ఉన్నాయి. వీటికి మంచి ఆదరణ వస్తుండటంతో రూ.64లక్షలతో పద్మాపురంలో 6 ట్రీ హట్స్, ఒక వ్యూ హట్, కొత్తవలసలో 12 రిసార్టులు నిర్మిస్తున్నారు. వీటనికి అక్టోబర్ నాటికి సిద్ధం చేస్తున్నట్లు ఐటీడీఏ పీవో తెలిపారు

పర్యాటకులకు సకల సౌకర్యాలు



గతంలో పద్మాపురంలో ట్రీహట్స్ అందుబాటులో ఉండేవి. హుద్‌హుద్ ధాటికి చెట్లు కూలిపోవడంతో నాశనమయ్యాయి. వాటి స్థానంలో కొత్తగా ఆరు నిర్మిస్తున్నాం. బెడ్‌రూమ్‌లాంటి విశాలమైన గది, బాత్ రూమ్, టాయిలెట్, టీవీ మొదలైన హంగులను ఏర్పాటు చేయనున్నాం. టూరిస్టులు వారి వాహనాలతో నేరుగా ట్రీ హట్స్ వద్దకే వెళ్లి.. హట్ కిందనే పార్కింగ్ చేసుకునేలా నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిద్వారా స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తాం.

– రోణంకి గోపాలకృష్ణ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి

భవిష్యత్తులో ప్రాజెక్టు విస్తరిస్తాం



లంబసింగి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. రిసార్టు పనులను త్వరలోనే ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు సిద్ధమయ్యారు. ఇక్కడి నుంచి వ్యూ పాయింట్ కూడా అద్భుతంగా ఉంటుంది. భవిష్యత్తులో లంబసింగి రిసార్టును మరింత విస్తరించే ప్రణాళికలు కూడా సిద్ధం చేశాం.

– శ్రీనివాస్ పాణి, టూరిజం రీజనల్ డైరెక్టర్

ఐదుగురు సచివాలయ సిబ్బందికి జీతాల నిలుపుదల

- విధులకు గైర్హాజరుపై పాడేరు ఐటీడీఏ పీవో ఆగ్రహం
- నాడు-నేడు పనులపై ఈఈకి షోకాజ్ నోటీసు



జి.మాడుగులలో పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న పీవో గోపాలకృష్ణ

జి.మాడుగుల: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పాడేరు ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ హెచ్చరించారు. మండలంలో కె.కోడాపల్లి, సింగర్భ, జి.మాడుగుల-1, 2 గ్రామ సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్లక్ష్యంగా ఉన్న సచివాలయం సిబ్బందిపై కొరడా ఝుళిపించారు. విధులకు గైర్హాజరైన కె.కోడాపల్లి వీఆర్వో అశోక్, సింగిర్భ వీఆర్వో మణి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు ప్రశాంత్, ప్రభాస్, వెటర్నరీ అసిస్టెంట్ రాజుల జీతాలు నిలుపుదల చేయడంతో పాటు షోకాజ్‌నోటీసులు జారీ చేశారు. సింగర్భ సచివాలయానికి నెటవర్క్ సదుపాయం కల్పించాలని ఎంపీడీవోను, సచివాలయ కొత్తభవనం నిర్మాణం పూర్తి కావడంతో దానిలోకి మారాలని సిబ్బందిని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణ పనులను చేపట్టాలని పీఆర్ ఈఈని ఆదేశించారు. జి.మాడుగుల పీహెచ్‌సీలోని నాడు-నేడు పనులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ రహదార్లు, భవనాల శాఖ ఈఈకి పీవో షోకాజ్ నోటీసు జారీ చేశారు. పీహెచ్‌సీకి వచ్చిన స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించి, అక్కడ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. మండల కేంద్రంలో కాఫీ ఎకో పల్పింగ్ యూనిట్ నిర్మాణపనులను పీవో పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం. రాజు, ఈవోపీఆర్డీ ఆర్.వి.ఎస్ రమేష్ తదితరలు పాల్గొన్నారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు

సాక్షి,పాడేరు: పాఠశాలలు, పీహెచ్‌సీల్లో నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయం నుంచి 11 మండలాల ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సీడీపీవోలు, ఉపాధిహామీ పథకం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పనులపై సమీక్షించారు. ముంచంగిపుట్టు మండలం కిలగాడ ఆస్పత్రిని ఈ నెల 3వ వారంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టాయని, జామిగుడ రోడ్డుకు తారురోడ్డు వేయాలని ఆదేశించారు. ఉపాధిహామీ పథకంలో మండలంలో 5వేల మందికి పనులు కల్పించాలన్నారు. అమ్మవారి దారకొండ నుంచి సీలేరు రోడ్డులో ఉన్న కల్వర్టుల పనులు, జర్రెల, కోరుకొండ, పినకోట ఆస్పత్రుల పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తాజంగిలో నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం, మిషన్ అమృత్ సరోవర్‌లో చెరువుల అభివృద్ధి, స్వచ్ఛసంకల్పం పనులపై సమీక్షించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, పలు ఇంజినీరింగ్ శాఖల ఈఈలు డి.వి.ఆర్.ఎం. రాజు, బాలసుందరబాబు, కొండయ్యపడాల్, లావణ్యకుమార్, డీఎల్‌పీవో పి.ఎస్. కుమార్, ఉపాధిహామీ ఏపీడీ జె.గిరిబాబు పాల్గొన్నారు.

వైద్య సేవలకు గ్రేడింగ్

- ఏపీవీవీ పరిధిలోని ఆస్పత్రుల్లో పనితీరు పరిశీలన
- ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు గ్రేడింగ్
- అనకాపల్లి, భీమునిపట్నం, పెందుర్తి, గోపాలపట్నం ఆస్పత్రులకు 'ఏ' గ్రేడ్
- నర్సీపట్నం, చోడవరం, నక్కపల్లి, కోటపాడు, కోటవురట్ల ముంచంగిపుట్టుకు 'బి' గ్రేడ్
- పాడేరు, అరకు, చింతపల్లి, యలమంచిలి, మాడుగులకు 'సి' గ్రేడ్



ముంచంగిపుట్టు సీహెచ్‌సీ

సాక్షి, అనకాపల్లి: ఏపీ వైద్య విధానపరిషత్ (ఏపీవీపీ) పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రేడింగ్ ఇస్తోంది. రోగులకు అందించే సేవలు, వైద్యులు, సిబ్బంది పనితీరు ఆధారంగా ఎ, బి, సి గ్రేడింగ్ ఇచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న జిల్లా, ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి నెల నుంచి ప్రతి నెలా పనితీరును బట్టి గ్రేడింగ్ ఇచ్చింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో రెండు జిల్లా ఆస్పత్రులు (అనకాపల్లి, పాడేరు), నాలుగు ఏరియా ఆస్పత్రులు (అగనంపూడి, నర్సీపట్నం, అరకు, చింతపల్లి), 10 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (భీమునిపట్నం, పెందుర్తి, గోపాలపట్నం, కోటవురట్ల, చోడవరం, కోటపాడు, నక్కపల్లి, యలమంచిలి, వి.మాడుగుల, ముంచంగిపుట్టు) ఈ గ్రేడింగ్‌లో చోటు దక్కించుకున్నాయి. ఓపీ, ఐపీ సేవల్లో అనకాపల్లిలోని ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయం, విశాఖలోని భీమునిపట్నం, పెందుర్తి, గోపాలపట్నం సీహెచ్‌సీలు లక్ష్యాన్ని మించాయి. ఏ గ్రేడ్ సాధించాయి. అదేవిధంగా అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం, చోడవరం, కోటపాడు, నక్కపల్లి, కోటవురట్ల ఆస్పత్రులు, విశాఖ జిల్లాలో అగనంపూడి సీహెచ్‌సీ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముంచంగిపుట్టు సీహెచ్‌సీలు బి గ్రేడ్ సాధించాయి. యలమంచిలి, వి.మాడుగుల, పాడేరు, అరకు, చింతపల్లి ఆస్పత్రులు 'సి' గ్రేడ్ సాధించాయి.

జిల్లాలో గ్రేడ్‌ల వివరాలు ఇలా ..

ఆస్పత్రి పేరు	ఏప్రిల్	మే	జూన్	జూలై
పాడేరు(డీహెచ్)	బి	సి	సి	సి
అరకు(ఏహెచ్)	సి	సి	సి	సి
చింతపల్లి(సీహెచ్‌సీ)	సి	సి	సి	సి
ముంచంగిపుట్టు	బి	బి	బి	బి

అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి 'ఎ' గ్రేడ్

అనకాపల్లి జిల్లా ఆస్పత్రికి జూన్ నెలలో 'ఎ' గ్రేడ్, ఏప్రిల్, మే, జూలై నెలల్లో 'బి' గ్రేడ్‌లు వచ్చాయి. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రితోపాటు కోటవురట్ల, చోడవరం సీహెచ్‌సీలకు వరుసగా నాలుగు నెలల్లో 'బి' గ్రేడ్‌లు వచ్చాయి. కోటపాడుకు మూడు నెలలు 'బి', ఒక నెల 'సి' గ్రేడ్ వచ్చింది. నక్కపల్లి సీహెచ్‌సీకి మూడు నెలలు 'సీ', జూలైలో 'బీ' గ్రేడ్ వచ్చింది. యలమంచిలి, వి.మాడుగుల సీహెచ్‌సీలకు వరుసగా నాలుగు నెలలూ 'సి' గ్రేడ్‌లే వచ్చాయి. అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో 26 వేల ఓపీలకు గానూ..10,005, ఐపీలు 2,300కి గానూ 1,555, గైనిక్ 200కి గానూ 194, ట్యూబెక్టమీలు 100కి గానూ 72 మందికి అందించారు.

సీహెచ్‌సీల్లో భీమునిపట్నానికి 'ఎ' గ్రేడ్

అన్ని రకాల ఇండికేటర్లలో భీమునిపట్నం సీహెచ్‌సీ ఉన్నత స్థానంలో నిలిచింది. వరుసగా నాలుగు నెలల్లో లక్ష్యాన్ని చేరుకొని 'ఎ' గ్రేడ్ సాధించింది. ఇక పెందుర్తి సీహెచ్‌సీ రెండు నెలలు 'ఎ' గ్రేడ్, మరో రెండు నెలలు 'సి' గ్రేడ్ సాధించింది. జూలై నెలలో భీమునిపట్నం ఆపరేషన్ థియేటర్లో 7250 ఆపరేషన్లలో 6527 జరిగాయి. ఐపీ 600లకు గాను 531 మందికి, ట్యూబెక్టమీలో 20కి 21 వాటిలో ఆపరేషన్స్ చేశారు.

పెరిగిన ఓపీలు, ప్రసవాలు...

మూడు జిల్లాల వారీగా జిల్లా, ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో రోగులను పరిశీలిస్తే...గతేడాది కంటే ఓపీలు గణనీయంగా పెరిగాయి. ప్రసవాలు కూడా పెరిగాయి. జనరల్ ఆపరేషన్లు, ట్యూబెక్టమీ ఆపరేషన్లు కూడా గతంకంటే ఎక్కువయ్యాయి. జిల్లా, ఏరియా ఆస్పత్రులకు దీటుగా సీహెచ్‌సీలలో వైద్య సేవలందుతున్నాయి. ప్రధానంగా గైనిక్ కేసులు టార్గెట్‌ను మించి కూడా వస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కాన్పు సురక్షితం..



వైద్యసేవల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలందిస్తున్నాం. ప్రధానంగా గైనిక్, పీడియాట్రిక్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. గతంలో కన్నా ఏరియా, సీహెచ్‌సీ ఆస్పత్రుల్లో గైనిక్ ప్రసవాలు పెరుగుతున్నాయి. ఇంటి దగ్గర కాన్పు సురక్షితం కాదు. ఆస్పత్రికి వెళ్లి కాన్పు చేయించుకోవడం ఉత్తమం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేట్ ఆస్పత్రుల కన్నా మెరుగైన సదుపాయం కల్పిస్తున్నాం. గర్భిణులకు ప్రసవ సమయంలో ఉచిత వైద్యంతో పాటు ఆర్థిక ప్రోత్సాహం, పౌష్టికాహారం అందిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లోనైనా ఎదుర్కొనేందుకు అవసరమైన సౌకర్యాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయి. –డాక్టర్ కిశోర్, డీసీహెచ్

వరద తగ్గుముఖం

- శాంతించిన గోదావరి, శబరి నదులు
- పాక్షికంగా కొనసాగుతున్న రాకపోకలు

చింతూరు: వరుసగా నాలుగోసారి విలీన మండలాల ప్రజలను బెంబేలెత్తించిన గోదావరి, శబరి నదుల్లో వరద ఉధృతి ఎట్టకేలకు తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద గరిష్ఠంగా రెండో ప్రమాద హెచ్చరిక దాటి 51.8 అడుగులకు చేరుకున్న గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుతూ గురువారం సాయంత్రానికి 43 అడుగుల దిగువకు చేరుకుంది. దీంతో అధికారులు రెండో, మొదటి ప్రమాద హెచ్చరికలను ఉపసంహరించారు. మరో వైపు గురువారం సాయంత్రానికి కూనవరం వద్ద గోదావరి 48 అడుగులు, చింతూరు వద్ద శబరినది 37 అడుగులకు తగ్గింది. ఇంకా వరదనీరు చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లోని ప్రధాన రహదారులను వీడలేదు. భద్రాచలం నుంచి కూనవరం, వీఆర్‌పురం మండలాలకు రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. చింతూరు మండలంలో సోకిలేరు, కుయిగూరు, చీకటి వాగుల వరద నీరు రహదారుల పైనే ఉండడంతో మండలంలోని 30 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. చింతూరు మండలం నిమ్మలగూడెం, కుయిగూరు నడుమ జాతీయ రహదారి-326పై వరదనీరు ప్రవహిస్తుండడంతో ఒడిశాకు వరుసగా నాలుగో రోజు కూడా రాకపోకలు స్తంభించాయి. చింతూరు మండలం చట్టి, చిడుమూరు వద్ద 30వ నంబరు జాతీయ రహదారి పైనుంచి వరదనీరు తొలగడంతో మన రాష్ట్రం నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. కాగా 30వ నంబరు జాతీయ రహదారిలో చింతూరు మండలం చట్టి, చిడుమూరు వద్ద రెండు లారీలు వరదనీటిలో చిక్కుకున్నాయి.



చిడుమూరు వద్ద వరదనీటిలో చిక్కుకున్న లారీని పొక్లెయిన్లతో బయటకు తీస్తున్న స్థానికులు



పోలిపాక వద్ద వరద ఉధృతికి కొట్టుకుపోయిన ఆర్అండ్‌బీ రహదారి

ఇళ్లకు చేరుతున్న వరద బాధితులు

కూనవరం: వరద తగ్గుముఖం పట్టడంతో పునరావాస కేంద్రాల నుంచి బాధితులు ఇళ్లకు చేరుతున్నారు. కూనవరం టేకులబోరు ఆర్అండ్‌బీ రోడ్డుపై గురువారం సాయంత్రం వరద నీరు తగ్గడంతో వాహన రాకపోకలకు అంతరాయం తొలగింది. పోలిపాక, పంద్రాజుపల్లి వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై వరద నీరు తగ్గడంతో కూనవరం నుంచి భద్రాచలానికి, కూనవరం నుంచి చింతూరుకు రాకపోకలకు లైన్ క్లియరైంది. కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే రహదారిపై పోలిపాక వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.



చింతూరు మండలం చట్టి వద్ద జాతీయ రహదారిపై వరదనీటిలో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

భార్యాభర్తల బలవన్మరణం

డుంబ్రిగుడ: చాపరాయి జలపాతంవద్ద బుధవారం ఆత్మహత్యకు యత్నించిన దంపతులు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా గోపాల్‌రెడ్డి నగర్ సిరిలింగాపల్లి గ్రామానికి చెందిన చెందిన పి.సంతోష్‌కుమార్, సునీత చాపరాయి వద్ద ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. స్థానికుల సహకారంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించి పరిస్థితివిషమంగాఉండడంతో అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి దిగజారడంతో కేజీహెచ్‌కు తరలించారు. గురువారం ఉదయం భార్యాభర్తలు మృతిచెందినట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఆర్థిక బాధలతో వారు ఆత్మహత్య చేసుకున్నారని, సునీత గర్భవతి అని ఆయన చెప్పారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగిస్తామన్నారు. వీఆర్వో జాన్సీ సమాచారంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంప్రదాయ సంబరం



గిరిజనుల సంప్రదాయ వంటకాలు, ఆచార వ్యవహారాలు, పండగలపై సీపీఎఫ్ స్వచ్ఛంద సంస్థ గురువారం పాడేరు మండలం కుజ్జెలి పంచాయతీ దిగుమోదాపుట్టులో గిరిజన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. థింసా నృత్యాలతో మహిళలు సందడి చేశారు. వీధి నాటకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గిరిజన యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కట్టెల పొయ్యిలపై వంటకాలను చేశారు.

మెయిన్‌లో..

ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఘన నివాళి

సాక్షి,పాడేరు: ఇంజినీరింగ్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఇంజినీరింగ్ అధికారులు నివాళులర్పించారు. పాడేరు గిరిజన సంక్షేమ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఈఈ డీవీఆర్ఎం రాజు, అరకులోయ కార్యాలయంలో ఈఈ వేణుగోపాల్, ఆర్అండ్బీ ఈఈ కార్యాలయంలో ఈఈ పి.బాలసుందరబాబు, పాడేరు ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఈఈ లీలా కృష్ణ, పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయంలో ఈఈ కొండయ్యపడాల్, డీఈఈ కార్యాలయంలో డీఈ రవికుమార్ ఇంజినీరింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. అరకులోయ, రంపచోడవరం, చింతూరు ప్రాంతాల్లోని ఇంజనీరింగ్ కార్యాలయాల్లో కూడా ఇంజనీర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్డబ్ల్యూఎస్ డీఈఈలు జీవీఎస్ ప్రకాష్, జయరాం, గోపాలకృష్ణమూర్తి, రుక్మందర్ రాజు, శివ, చంద్రకిరణ్, ఆర్అండ్బీ డీఈఈలు వెంకటరావు, శశిధర్, గిరిజన సంక్షేమ డీఈఈలు అనుదీప్, చాణక్యరావు, పలు శాఖల ఏఈఈలు నాగేంద్ర కుమార్, భరతుడు, ప్రసాద్, దుర్గా ప్రసాద్, నాయుడు, సుబ్బారావు, రమేష్, విజయ్కుమార్ పాల్గొన్నారు.



మోక్షగుండం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆర్డబ్ల్యూఎస్ ఈఈ లీలా కృష్ణ, అధికారులు



రాష్ట్ర స్థాయి అవార్డు అందుకుంటున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ నవీన్కుమార్

సేవలతోనే గుర్తింపు

అనంతగిరి: సేవలే గుర్తింపునిస్తాయని జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి లావణ్యకుమార్ అన్నారు. అనంతగిరి మండలంలోని చిలకలగెడ్డ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న నవీన్కుమార్కు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఇంజినీరింగ్ డే సందర్భంగా అవార్డును పాడేరులో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతగా పనిచేసిన వారికి తప్పక గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొండయ్యపడాల్ తదితరులు పాల్గొన్నారు.

మేఘాలు కనువిందు

పాడేరు-హుకుంపేట రోడ్డులోని మేఘాలు చూపరులను కనువిందు చేశాయి. పచ్చని కొండలను తాకుతూ చింతల వీధి సమీపంలోని ఆకాశం నిండా తెల్లని మేఘాలు చూపరులను అబ్బుర పరిచాయి. పాడేరు-హుకుంపేట రోడ్డులోని పలు చోట్ల కూడా మేఘాలు ఆకర్షించాయి. - పాడేరు





పోలీసుస్టేషన్ ఎదుట సర్పంచ్ల ఆందోళన

- ఇద్దరు కానిస్టేబుళ్లు దురుసుగా ప్రవర్తించారని ఆవేదన
- క్షమాపణ చెప్పడంతో సద్దుమణిగిన వివాదం

ముంచంగిపుట్టు: స్థానిక పోలీసుస్టేషన్కు పనుల నిమిత్తం వెళ్లిన తమ పట్ల ఇద్దరు కానిస్టేబుళ్లు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఎనిమిది మంది సర్పంచ్లు గురువారం ఆందోళనకు దిగారు. పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. వీరికి పలు రాజకీయ పార్టీల నేతలు మద్దతు పలికారు. సర్పంచ్ల పట్ల కానిస్టేబుళ్లు దురుసుగా ప్రవర్తించడం తగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సుమారు గంటపాటు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. సర్పంచ్ రవీంద్ర సర్పంచ్లకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోవడంతో ఇద్దరు కానిస్టేబుళ్లతో క్షమాపణ చెప్పించడంతో గొడవ సద్దుమణిగింది. ఈ ఆందోళనలో సర్పంచ్లు నర్సింగరావు, ,సుభాష్చంద్ర, గంగాధర్, లక్ష్మణ్, త్రినాథ్, బాబూరావు, నేతలు మాధవరావు, శాస్త్రిబాబు, శ్రీను, రాంప్రసాద్, దాసు, ప్రసాద్, జగత్రాయ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సర్పంచ్లు, నేతలు

టీచర్ డిప్యుటేషన్ రద్దు చేయాలని ఆందోళన



తుమిడిపుట్టు పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న సర్పంచ్,విద్యార్థులు,తల్లిదండ్రులు

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ తుమిడిపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్పై మరొక పాఠశాలకు పంపించడం సరికాదని సర్పంచ్, విద్యాకమిటీ చైర్మన్, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. రద్దు చేయాలని కోరుతూ ఆందోళనకు దిగారు. నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ పాఠశాలలో 71 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వీరిలో ఒకరిని మరొక పాఠశాలకు డిప్యూటేషన్పై పంపడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దీనిపై ఎంఈవో చెల్లయ్యను వివరణ కోరగా ఉపాధ్యాయుడు లేక మరో పాఠశాల మూతపడి ఉన్నందున తుమిడిపుట్ట పాఠశాల ఉపాధ్యాయుడితో సర్దుబాటు చేశామన్నారు.

గర్భిణులను ముందుగా ఆస్పత్రిల్లో చేర్పించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుజాత

జి.మాడుగుల: గర్భిణులను ప్రసవ సమయానికి వారం రోజుల ముందుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేర్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సుజాత ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలో పలు గ్రామాల నుంచి వచ్చిన రోగులతో మాట్లాడారు. పీహెచ్సీలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. మందులు, రికార్డులను ఆమె తనిఖీ చేశారు. కస్తూర్బా విద్యాలయాన్ని ఆమె సందర్శించారు. జిల్లా అదనపు జిల్లా వైద్యాధికారి కె లీలాప్రసాద్, వైద్యాధికారి విష్ణుష్ ఆరోగ్య విస్తరణాధికారులు నడిగట్ల ప్రకాష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



జి.మాడుగుల పీహెచ్సీలో వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్వో డాక్టర్ సుజాత

రాజ్మా విత్తనాలు సద్వినియోగం

జిల్లా వ్యవసాయాధికారి నందు

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన రైతులు రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నందు తెలిపారు. 90శాతం సబ్సిడీపై చింతపల్లి రెడ్ అనే మేలుజాతి రాజ్మా విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో తెచ్చిందని, ఇప్పటికే 4100 క్వింటాళ్లను పంపిణీ చేసినట్టు తెలిపారు. విత్తనాలు పొందిన రైతులంతా సాగు వివరాలను ఈక్రాప్లో నమోదు చేసుకోవాలని, విత్తనాలను దుర్వినియోగం చేస్తే వచ్చే సీజన్లో పలు రాయితీలకు ఆయా రైతులను అనర్హులుగా పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు.

కారులో గంజాయి స్వాధీనం!

మారేడుమిల్లి: మారేడుమిల్లి మీదుగా అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్థానిక పోలీసులు గురువారం పట్టుకున్నట్టు తెలిసింది. వివరాలివి. వై.రామవరం మండలం లోతట్టు ప్రాంతం నుంచి కారులో గంజాయిని మైదాన ప్రాంతానికి తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు పోలీసులు స్థానిక పోలీస్స్టేషన్ వద్ద పట్టుకుని కారులో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయితో ఉన్న కారు

సారా బట్టీలపై దాడులు

అనంతగిరి: బట్టీలు నిర్వాహకుల్లో మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎస్ఐ దాస్ అన్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీలోని సారా బట్టీలపై గురువారం దాడులు నిర్వహించారు. 800 లీటర్ల పులుపు ధ్వంసం చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఒకరిని ఆరెస్ట్ చేసినట్టుగా ఎస్ఐ తెలిపారు. పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మార్పురాకపోతే కఠిన చర్యలు తప్పవని, అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో సారా నిర్మూలనకు యువత ముందుకు రావాలని కోరారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



దాడులు నిర్వహిస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ దాస్, తదితరులు

వివాహిత అనుమానాస్పద మృతి

సాక్షి,పాడేరు: స్థానిక బక్కులపనుకు ప్రాంతంలో నివాసం ఉంటున్న వివాహిత తుచ్చా జయలక్ష్మి(46) మృతిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని పాడేరు ఎస్ఐ లక్ష్మణ్ గురువారం విలేకరులకు తెలిపారు. మృతురాలు జయలక్ష్మి బుధవారం సాయంత్రం ఇంటివద్ద వాంతులు చేసుకోవడంతో ఆమె భర్త కొర్ర రాంబాబు ఆస్పత్రికి తీసుకువెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతురాలు జయలక్ష్మి అన్నదమ్ములు ఆమె మరణంపై అనుమానం వ్యక్తం చేస్తు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



జయలక్ష్మి మృతదేహం

నదిలో జారిపడి ఒకరి గల్లంతు

ఎస్.రాయవరం: పెనుగొల్లు ధర్మవరం వరహానది బ్రిడ్జిపై నుంచి ప్రమాదవశాత్తూ పడి ఓ వ్యక్తి గల్లంతైనట్టు ఎస్ఐ ప్రసాద్రావు తెలిపారు. పెనుగొల్లు గ్రామానికి చెందిన గొర్ల నాగసూరిఅప్పారావు(25) గురువారం ఇంటివద్ద నుంచి నదివైపు వస్తుండగా బ్రిడ్జిపై నుంచి నదిలో జారిపడి గల్లంతయ్యాడు. ఇది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఎస్.రాయవరం పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చర్యలు చేపట్టారు. రేవు పోలవరం గ్రామానికి చెందిన గజఈతగాళ్లను నది వద్దకు తీసుకువచ్చి గాలింపు చేపట్టామని ఎస్ఐ తెలిపారు. నదిలో నీరు ఉధృతంగా ఉండడం వల్ల ఆచూకీ తెలియలేదని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.



గల్లంతైన నాగసూరి అప్పారావు కోసం నదిలో గాలింపు చర్యలు

దొరికిన ఏటీఎం కార్డు పోలీసులకు అందజేత

కశింకోట: కశింకోటలోని ఏటీఎం కేంద్రంలో పాఠశాల విద్యార్థులు తమకు లభ్యమైన ఏటీఎం కార్డును తీసుకెళ్లి ఎస్ఐ ఆదినారాయణరెడ్డికి గురువారం అందజేసి తమ నిజాయితీని నిరూపించుకున్నారు. మండలంలోని తేగాడ వద్ద ఉన్న ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో చదువుతున్న కశింకోటకు చెందిన పలువురు విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి బస్సు కోసం స్థానిక రిక్షా స్టాండ్ వద్ద కూడలిలో ఉన్న ఏటీఎం కేంద్రం వద్ద నిరీక్షించారు. ఈ సమయంలో అక్కడ ఎవరిదో పడిపోయిన ఏటీఎం కార్డు దొరికింది. దీంతో బాధ్యతగా వ్యవహరించి పోలీసు స్టేషన్కు వెళ్లి ఎస్ఐ ఆదినారాయణరెడ్డి అందజేశారు. దీంతో ఎస్ఐ వారిని అభినందించారు.

ఏలేరు కాల్వలో మృతదేహం లభ్యం

తుమ్మపాల: అనకాపల్లి జీవీఎంసీ విలీన గ్రామం కొండకొప్పాక వద్ద ఏలేరు కాలువలో మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ఐ నర్సింహారావు అందించిన వివరాలు ప్రకారం విజయనగరం రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసముంటున్న పెంటకోట సామి (33) చిత్రకొండలో కిరాణా వ్యాపారం చేస్తుంటాడు. అతడికి భార్య భవానీ, కుమారుడు ఉన్నారు. అతడు మునగపాకలో ఉంటున్న తన సోదరి ఆడారి కుమారి ఇంటికి ఈ నెల 14వ తేదీ ఉదయం వచ్చారు. అదే రోజు అక్కడ నుంచి బొజ్జన్న కొండను సందర్శించేందుకు వెళ్ళాడు. గురువారం కొండకొప్పాక వద్ద మృతదేహం ఉన్నట్టు సమాచారం అందిందని, మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.



మృతుడు పెంటకోట సామి

పశువ్యాధులపై అప్రమత్తత

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటస్వామి

హుకుంపేట: పశువ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటస్వామి అన్నారు. గురువారం మండలంలోని సూకురు, సంతారి రైతుభరోసా కేంద్రాల పరిధిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు విజ్ఞానబడి నిర్వహించారు. దీనిలో భాగంగా పశువ్యాధులపై అవగాహన కల్పించారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యసిబ్బందికి ముందుగా సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పశువైద్యానికి 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. ఇంటివద్దకే పశువైద్యాధికారులు వచ్చి వైద్యం అందిస్తారన్నారు. పాడేరు ఏడీ రాజారవికుమార్, స్థానిక పశువైద్యాధికారి కూడా చరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



గిరిజనులతో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటస్వామి

పిల్లలై.. సందడి చేసిన పూర్వ విద్యార్థులు

రావికమతం: 52 ఏళ్ల క్రితం పదో తరగతి చదివిన వారంతా చదువుల తల్లి నీడలో సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి రోజులను నెమరు వేసుకున్నారు. బడిలో చేసిన చిలిపి చేష్టలు, అల్లరి పనులు గుర్తు చేసుకుని మురిసిపోయారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఇప్పుడు ఎవరెవరూ ఏం చేస్తున్నారో తెలుసుకున్నారు. గురువారం కొత్తకోటలో దేవాలయం వీరికి వేదికైంది. ఇక్కడ పెంటపాటి సూర్యారావు మెమోరియల్ జెడ్పీ హైస్కూల్లో 1969–70 పదో తరగతి బ్యాచ్కు చెందిన వీరంతా రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. కుశల ప్రశ్నలు, జోకులేసుకుంటూ కేరింతలు కొడుతూ వయసు మర్చి పిల్లలైపోయారు. అనంతరం అప్పటి సోషల్ ఉపాధ్యాయుడు యు.గోపాలకృష్ణ, సైన్స్ టీచర్ పి.వి. రమణారావులను ఆత్మీయంగా సత్కరించారు. పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. తొలుత అప్పటి విద్యార్థులు రాయప్రోలు శ్రీరామ్మూర్తి, వరహాగిరి కోదండరావు, రుత్తల ఎర్రాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో సరదాగా గడిపిన పూర్వ విద్యార్థులు

ఆటో చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

కశింకోట: కశింకోటలో ఆటో దొంగతనానికి పాల్పడిన విశాఖకు చెందిన ఇద్దరిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆదినారాయణరెడ్డి గురువారం తెలిపారు. విశాఖలోని మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన మామిడి గౌరీశంకర్, చెల్లిబోయిన మహేష్ బైక్ మీద ఈ నెల 12న వచ్చి కశింకోట వద్ద రోడ్డు పక్కనున్న ఆటోను తస్కరించి వారిలో ఒకరు నడుపుకొని, మరొకరు బైక్ మీద విశాఖకు తీసుకెళ్లిపోయారు. సీట్లు మార్పు చేసి విక్రయించారు. దీంతో ఈ విషయమై ఫిర్యాదు అందిన మేరకు కేసు నమోదు చేసి విశాఖలో విక్రయించిన ఆటోను పట్టుకొని స్వాధీనం చేసుకొని నిందితుల్ని అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు. వారిని వ్యక్తిగత బెయిల్పై విడిచి పెట్టామన్నారు.

అడవి పంది దాడిలో ఒకరు మృతి

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ కోటగున్నలకు చెందిన తాంబేలి లింగు (40) అనే గిరిజనుడు గురువారం అడవిపంది దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన అతనిపై అడవిపంది దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. దీంతో అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారి మహేశ్వరరావు తెలిపారు. అతనికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

చింతపల్లి: మండలంలోని లంబసింగికి చెందిన పిట్టల సింహాచలం అనే మహిళ గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె ఆత్మహ్యతకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని పదో తరగతి చదువుతున్న బాలిక అదృశ్యమైందని ఎస్ఐ ఉపేంద్ర గురువారం చెప్పారు. ఈమేరకు వారి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

క్షతగాత్రులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించిన డీఎస్పీ సునీల్

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట వద్ద గురువారం రాత్రి గురుత్ తెలియని వాహనం ఢీ కొన్న ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులను అటుగా వెళ్తున్న అనకాపల్లి డీఎస్పీ బి.సునీల్ గమనించి వారిని తన వాహనంలో ఎక్కించి చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చోడవరం దగ్గర ద్వారకానగర్కు చెందిన మలిశెట్టి తాడయ్య, అతని భార్య ఉమ ద్విచక్ర వాహనంపై నర్సీపట్నంలో ఉన్న తన బంధువుల ఇంటికి ఉదయం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ద్వారకా నగర్కు వస్తుండగా విజయరామరాజుపేట బొడ్డేరు వంతెన దగ్గరలో ఎదురుగా వస్తున్న బొలేరా వాహనం వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి పరారైంది. అదే సమయంలో బుచ్చెయ్యపేట పోలీస్స్టేషన్ నుంచి అనకాపల్లి వెళ్తున్న డీఎస్పీ సునీల్ తన వాహనాన్ని ఆపి గాయాలై రోడ్డు పక్కన పడివున్న భార్యాభర్తలను తన సిబ్బంది సహాయంతో వాహనంలో ఎక్కించి చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్య సిబ్బంది వెంటనే వైద్య సేవలు అందేలా చేశారు. తాడయ్య, ఉమకు తలపైన, ఒంటిపైన తీవ్ర గాయాలు కాగా ఉమ పరిస్థితి విషమంగా ఉండడంతో అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. డీఎస్పీ సేవా గుణాన్ని పలువురు అభినందించారు. బుచ్చెయ్యపేట ఎస్ఐ కుమారస్వామి రోడ్డు ప్రమాదంపై విచారణ చేస్తున్నారు.



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న డీఎస్పీ సునీల్

గ్రామగ్రామాన సు'రక్షిత' నీరు

- చింతపల్లిలో తాగునీటి పరీక్షలు
- వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు


చింతపల్లిలో నీటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చింతపల్లిరూరల్: గ్రామాల్లో రక్షిత తాగునీటి పథకాల ద్వారా గిరిజనులకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ తాగునీటికి నిరంతరం పరీక్షలు నిర్వహిస్తోంది. ఎక్కడైనా కలుషితాలు ఉంటే ఆ నీటిని శుద్ధికి చర్యలు చేపడుతోంది. ఫ్లోరైడ్ తదితర కలుషితాల్లేవని నిర్ధారించకున్నాక ప్రజలు వినియోగించకోవడానికి అనుమతిస్తున్నారు. ఇప్పుడు గ్రామీణ తాగునీటి కేంద్రాల నుంచి అందిస్తున్న నీరు సురక్షితం, స్వచ్ఛమైనట్టు పరీక్షలు తేటతెల్లం చేస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో బోర్లు, బావులు, చెరువులు, తాగునీటి పథకాల నీటిని పరీక్షలు చేస్తోంది. అవసరమైతే మరోసారి కూడా పరీక్షలు చేస్తున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలోని బోర్ల నీటికి కూడా విస్తృతంగా పరీక్షిస్తున్నారు.

నాలుగు మండలాల నీటి శాంపిల్స్‌కు పరీక్ష

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో నీటి పరీక్ష ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు, జి.మాడుగుల మండలాలకు సంబంధించిన మంచినీటి పథకాల శాంపిల్స్‌ను ఇక్కడ పరీశీలించనున్నారు. గతంలో పరీక్ష ల్యాబ్‌లు లేకపోవడం వలన నమూనాలను నర్సీపట్నం, పాడేరు ల్యాబ్‌లకు పంపించేవారు. అక్కడ నిర్ధారణ జరిగి ఫలితాలు పంపే వరకు చాలా సమయం పట్టేది. దీంతో గిరిజనులు కలుషిత జలాలను వినియోగించి రోగాల బారిన పడేవారు. నీటి పరీక్షలు నిర్వహించిన తరువాత ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు ప్రతి మంచినీటి పథకం నీటిని ల్యాబ్‌లో పరీక్షిస్తారు. నాలుగు మండలాల్లో 808 తాగునీటి పథకాలు, 1208 బోర్లు వినియోగంలో ఉన్నాయి. ఈ పథకాల్లో నీటి నమూనాలను స్థానిక ల్యాబ్‌లో పరీక్షిస్తారు. నీటి పరీక్షల కేంద్రం అందుబాటులోకి రావడంతో గిరిజనులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుంది.

గ్రామాలకే నీటి కిట్లు

సాధారణంగా గ్రామాల్లో తాగునీటి శాంపిల్స్‌ను ఆర్‌డబ్ల్యూఎస్‌కు అనుబంధంగా పనిచేసే ల్యాబ్‌లలో పరీక్షిస్తారు. నీటి నాణ్యతను పరీక్షించేందుకు అన్ని గ్రామాలకు ఎఫ్‌టీకే కిట్లను పంపిణీ చేస్తోంది. వీటితో నీటిలో 8 రకాల ప్రమాదకర రసాయనాలను గుర్తించొచ్చు. ఒక్కో కిట్‌తో వంద శాంపిల్స్‌ను పరీక్షించొచ్చు. ఆయా కిట్లతో పాటు నీటిలో ప్రమాదకర బ్యాక్టీరియాను గుర్తించేందుకు హెచ్‌టూఎస్ కెమికల్ సీసాలను కూడా పంపిణీ చేశారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీరు



నీటి పరీక్ష ల్యాబ్ ఉండడం వలన ఏడాదికి రెండు సార్లు పరీక్షలు నిర్వహిస్తాం. నీరు స్వచ్ఛ మైనదా కాదా పరీక్షల్లో నిర్ధారణ అవుతుంది. నాలుగు మండలాలకు సంబంధించి ఇక్కడే పరీక్షలు నిర్వహిస్తాము. ప్రజలకు స్వచ్ఛమైన నీరందించడమే లక్ష్యం.

– స్వర్ణలత, ఆర్‌డబ్ల్యూస్ జేఈ, చింతపల్లి

ఓజోన్ పరిరక్షణపై అవగాహన అవసరం

అరకులోయ : ఓజోన్ పొర పరిరక్షణకు అందరూ భాగస్వామ్యం కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల్లో రసాయనశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణతో పాటు ఓజోన్ పొర రక్షించుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. ఓజోన్ పొర క్షీణత, వాటి పరిరక్షించే మార్గాలను అధ్యాపకులు అనితకుమారి, శోభన్ వివరించారు. క్విజ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు,


అరకులోయలో విద్యార్థులకు బహుమతులిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్

పాడేరు రూరల్ : పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టాబ్బాయి మాట్లాడుతూ ఓజోన్ పొర యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు

జి.మాడుగుల: ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాల మేరకు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల–2లో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. హెచ్‌ఎం డి.ప్రదీప్‌చంద్ర, డిప్యూటీ వార్డెన్ ఎం.మోహన్‌బాబు, సీహెచ్‌వో జమ్మాయమ్మ, పీహెచ్ఎన్ గౌరి, హెల్త్ అసిస్టెంట్ పడాల్, ఏఎన్ఎం చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ముంచంగిపుట్టు: కించాయిపుట్టు పంచాయతీ గడ్డిబంద, రాములు, వర్కుగుమ్మి గ్రామాల్లో కిలగాడ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. కిలగాడ వైద్యాధికారి రమేష్ 72 మందికి వైద్య పరీక్షలు చేశారు. 9 మంది జ్వరబాధితులకు రక్తపరీక్షలు చేసి, మందులు అందజేశారు. రాములు గ్రామంలో సెకిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న సంతోష్ అనే బాలుడుని పరిశీలించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ, టీబీ, డయేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఎంపీహెచ్‌ఈవో కె.సుబ్రహ్మణ్యం, ఎంపీహెచ్ఏ డి.చిట్టిబాబు, ఎంఎల్‌హెచ్‌పీ రోషిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కన్స్యూమర్ ఫోరం జాతీయ కార్యదర్శిగా రఘునాథ్


కన్స్యూమర్ ఫోరం జాతీయ అధ్యక్షుడు సుభాష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఘునాథ్

అరకులోయ రూరల్: కన్స్యూమర్ జాతీయ కార్యదర్శిగా సమర్థి రఘునాథ్ ఎన్నికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీలో కన్స్యూమర్ ఫోరం ఆల్ ఇండియా అధ్యక్షుడు సుభాష్ బిహారీ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో జాతీయ కమిటీ ఎన్నిక జరిగింది. ఇందులో భాగంగా జాతీయ కార్యదర్శిగా సమర్థి రఘునాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ, ఆంధ్రా ఉమ్మడి రాష్ట్రాల ఫోరం వర్కింగ్ అధ్యక్షుడిగా సందీప్ ఎన్నికైనట్టు ఆయన తెలిపారు. వినియోగదారు చట్టాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు.

రైతులకు సూచనలు

పాడేరు రూరల్ : మినుములూరులో శుక్రవారం ఏపీసీఎన్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి సాగులో భాగంగా ఎంసీఆర్‌పీ లోహితాస్ బ్రహ్మాస్త్రం కషాయం తయారీని రైతులకు వివరించారు. సర్పంచ్ చిట్టమ్మ, సిబ్బంది సాహైల్, సర్వేశ్వరరావు తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


అవార్డు గ్రహీత నాగేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెదబయలు: స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల–1 హెచ్‌ఎం తామర నాగేశ్వరరావును స్థానిక ఎంపీపీ బి.వరహాలమ్మ, ఎంఈవో కె.సింహాచలం, సహచరులు తదితరులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన గురుపూజోత్సవంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా నాగేశ్వరరావు అందుకున్న విషయం తెలిసిందే. వక్తలు మాట్లాడుతూ స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు అవార్డులు రావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించి మండలానికి మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇటీవల కలెక్టర్ నుంచి అవార్డులు అందుకున్న మర్రిచెట్లు వెంకటేశ్వర్లు నాయుడు, చెండా బాలకృష్ణను కూడా ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు, ఉపాధ్యాయ సంఘ నాయకుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ మేళా


మేళా నిర్వహిస్తున్న ఎస్‌డీఈ రామ్‌జీ

సాక్షి, పాడేరు : పాడేరులోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ కేర్ సెంటర్ వద్ద శుక్రవారం బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ కనెక్షన్ మేళాను నిర్వహించారు. ఫైబర్‌నెట్ సేవలను ఎస్‌డీఈ రామ్‌జీ వివరించారు. వినియోగదారుల నుంచి దరఖాస్తులు పొందారు. సిమ్ కార్డుల అమ్మకాలు జరిపారు. ఫైబర్‌నెట్ ఫ్రాంచైజీ వేమగిరి సత్యనారాయణ, బీఎస్ఎన్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న కొర్రా పద్మ, ఎంపీడీవో లోహిత్ జయసాగర్

జి.మాడుగుల: మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన ప్రహరీ నిర్మాణ పనులను ఎంపీపీ పద్మ, ఎంపీడీవో లోహిత్ జయసాగర్ శుక్రవారం ప్రారంభించారు. కార్యాలయ భవనం గోడ గతంలో వచ్చిన తుపానుకు నేలకూలింది. మండల పరిషత్ కార్యాలయం భద్రతా రీత్యా రూ.2.60లక్షల అంచనా నిధులతో గోడ నిర్మాణ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి, ఈవోపీఆర్డీ ఆర్.వి.ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

జి.మాడుగుల: గెమ్మెలి పంచాయతీలో పలు గ్రామాల్లో ఎంపీపీ కొర్రా పద్మ, ఎంపీడీవో లోహిత్ జయసాగర్ శుక్రవారం పర్యటించారు. చీమలపాడు గ్రామంలో శిథిలావస్థకు చేరిన చెక్‌డ్యామ్ వలన సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నామని గిరిజన రైతులు వారి దృష్టికి తెచ్చారు. అలాగే గ్రామంలోని చిన్నపిల్లల కోసం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు బొజయ్య, జవతి, కళ్యాణ్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలు బాధ్యతల స్వీకరణ

ఎటపాక: మండలంలోని పలు గ్రామాల్లోని రెవెన్యూ శాఖలో బదిలీపై వచ్చిన ఎనిమిది మంది అధికారులు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎటపాకకు ఎం.రామ్మూర్తి, చోడవరానికి కె.ఇందిర కుమారి, టి.పి.వీడుకు కె.జోగారావు, రాయనపేటకు కె.మారయ్య, నెల్లిపాకకు ఎస్.వెంకటరమణ, లక్ష్మీపురానికి ఎస్.సత్యనారాయణ, విస్సాపురానికి జె.సత్యనారాయణ, గౌమ్ముకొత్తగూడెనికి ఎం.ధర్మరాజు వీఆర్వోలుగా బాధ్యతలు తీసుకున్నారు.మిగిలిన నాలుగు సచివాలయాలకు వీరిలోనే నలుగురికి ఇన్‌చార్జి బాధ్యతలను ప్రస్తుతానికి అప్పగించారు.

ఎంపీడీవోకు సన్మానం

ముంచంగిపుట్టు: ఎంపీడీవోగా బాధ్యతలను చేపట్టిన ప్రభాకరంను గ్రామ సచివాలయ ఉద్యోగులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఉద్యోగుల సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని ఎంపీడీవో ప్రభాకరం చెప్పారు.

దంతాల సంరక్షణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గౌతమి

వై.రామవరం: నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా, జాతీయ ఆరోగ్య కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్, దంత వైద్యాధికారి డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో దంతాల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాడైన దంతాలకు చికిత్స చేయించుకునే విధానం తదితర అంశాలపై పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఆయా విషయాలను ఉపాధ్యాయులు పాఠాల రూపంలో విద్యార్థులకు బోధిస్తూ, అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో ౨ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ, టీచర్ల పాల్గొన్నారు.

సచివాలయాల్లో రోజూ స్పందన నిర్వహించాలి


మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ శ్రీనివాస్

చింతపల్లి: సచివాలయాల్లో ప్రతి రోజు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఈవోపీఆర్డీ శ్రీనివాస్ అన్నారు.ఎంపీడీవో సీతయ్య అధ్యక్షతన కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి


మొక్కలు నాటుతున్న ఎంపీడీవో శ్రీహర్షిత్

అనంతగిరి: కొత్తూరు పంచాయతీలోని చెత్త సంపద కేంద్రాన్ని ఎంపీడీవో శ్రీహర్షిత్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వీధుల్లో సేకరించిన తడి, పొడి చెత్త నుంచి సంపద తయారు చేయవచ్చునని, గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులుగా మార్చుకోవాలన్నారు. దీంతో వీధులు పరిశుభ్రంగాను, పంచాయతీకి ఆర్థిక వనరులుగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సచివాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. సర్పంచ్ సీతయ్య, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు కృష్ణంరాజుకు ఘన నివాళి


కృష్ణంరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిత్రం యూనిట్ బృందం

మారేడుమిల్లి : లేడీలైన్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై మారేడుమిల్లి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్న ఎన్ టీహెచ్ (ఎన్త్ అవర్) అవర్ చిత్ర యూనిట్ బృందం గురువారం రాత్రి లొకేషన్‌లో నటుడు కృష్ణంరాజు మృతి పట్ల సంతాప సభ నిర్వహించి, ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. చిత్రం యూనిట్ నిర్మాత రాజు గుడి గుంట్ల మాట్లాడుతూ కృష్ణంరాజు విభిన్న పాత్రలను పోషించి, ప్రేక్షకుల మనస్సుల్లో రెబల్‌స్టార్‌గా చిరస్థాయిగా చెరగాని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆయన మృతి సినీ పరిశ్రమకు తీరని లోటన్నారు. ఎన్త్ అవర్ మూవీ గురించి మాట్లాడుతూ కొత్త కథాంశంతో తెరకెకుతున్న ఈ చిత్రం హీరో, హీరోయిన్ దర్శక, నటీనటులందరూ కొత్తవాళ్లని తెలిపారు. డైరక్టర్ ఆనంద్ మాట్లాడుతూ సినీమా మొదటి షెడ్యూల్‌లో భాగంగా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో 15 రోజుల పాటు షూటింగ్ జరుగుందన్నారు. అనంతరం రెండోవ షెడ్యూల్ హైద్రాబాద్‌లో జరుగుతుందన్నారు. ఈ సినీమాకు సంగీతం మహా శశాంక్, కెమెరామెన్‌గా చెంచు, ఫైట్ మాస్టర్‌గా శంకర్, ఎడిటర్‌గా నందమూరి హరి, మాటలు విక్రమ్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నాదెండ్ల సురేష్ బాబు, నిర్మాణ సారథ్యం లంక దాసరి ప్రసాద్‌రావు పనిచేస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులు చదువులో రాణించాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలాజీ బాబు

మారేడుమిల్లి: బొడ్లంక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాలను జెట్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు శుక్రవారం సందర్శించారు. విద్యా ర్థులు బాగా చదవుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు.

గంగవరం: జడేరు ఎంపీపీ పాఠశాలను జెడ్పీటీసీ సభ్యురాలు బేబిరత్నం శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు.

పనుల్లో నాణ్యత తప్పనిసరి


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి తదితరులు

రాజవొమ్మంగి: కింద్ర గ్రామంలోని జీపీకే పాఠశాలలో నాడు–నేడు పనులకు స్థానిక ఎంపీపీ గోము వెంకట లక్ష్మి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ గుమ్మిడి సీత శుక్రవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. సర్పంచ్ బూసరి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, వార్డు సభ్యులు మంగ, సూరిబాబు, స్కూల్ కమిటీ సభ్యులు నాగు, నూకరాజు, సన్యాసి రావు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

హుకుంపేట: కామయ్యపేట, రాతులపుట్టు, బొడ్డాపుట్టు, బిజ్జపల్లి, తీగలవలస, ఉక్కుర్బ గ్రామాల్లోని పాఠశాలలను ఎంఈవో ఎస్.రామచంద్రరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని చేయాలని సూచించారు. సీఆర్‌పీ రత్నం, హెచ్‌ఎం రమేష్ తదితరులున్నారు.

పాడేరు రూరల్ : కుజ్జెలి పంచాయతీ తూరుమామిడి గ్రామంలో నాడు–నేడు కింద చేపడుతున్న పాఠశాల భవన నిర్మాణానికి సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యుడు నర్సింహమూర్తి, మాజీ సర్పంచ్ సూరిబాబు, నాయకులు రాజారావు, నాగరాజు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: పెంటపాడు పాఠశాలలో నాడు–నేడు పనులను శుక్రవారం సర్పంచ్ పుష్పలత ప్రారంభించారు. హెచ్‌ఎం శ్యామ్యూల్, ఎంపీటీసీ జయలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

పెదబయలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న సుపరిపాలన, చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు చేరుతున్నారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ చెప్పారు. మండలంలోని మారుమూల గుల్లేలు పంచాయతీ గుల్లేలు, రెంజలమామిడి, మద్దివీధి, కర్రిమామిడి గ్రామాల్లో టీడీపీకి చెందిన 60 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ చేరారు. వారికి శెట్టి వినయ్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వినయ్ మాట్లాడుతూ 75 ఏళ్లగా ఏజెన్సీలో జరగని అభివృద్ధిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మూడేళ్లలో చేపట్టిందన్నారు. శివారు గ్రామాల్లో సైతం విస్తృతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పారీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్టు చెప్పారు. పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ ఎన్నడూ ఊహించని విధంగా ప్రస్తుతం మన్య ప్రాంతం అభివృద్ధి చెందుతోందని, వైఎస్సార్‌సీపీతో ఉంటామని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తామన్నారు. చీమకొండ నుంచి 2 కిలో మీటర్లు నడుచుకొని నాయకులు గ్రామానికి చేరుకున్నారు. ఇంతవరకు మా గ్రామానికి ఎవ్వరు రాలేదని మహిళలు స్వాగతం పలికారు. వైస్ ఎంపీపీ రాజుబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురేష్‌కుమార్, సర్పంచ్‌లు కృష్ణారావు, రవి శంకర్, ఉప సర్పంచ్ మత్స్యకొండబాబు, నాయకులు సూర్యనారాయణ, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల నిరసన

అరకులోయ రూరల్/జీకే వీధి/ఎటపాక: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. అరకులోయ, జీకే వీధిలో నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం గిరిజన చట్టాలు అమలుచేయడం లేదన్నారు.ఎటపాకలో నాయకులు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పరిహారం పూర్తిస్థాయిలో అందించాలని డిమాండ్ చేశారు. బుజ్జిబాబు, సత్యనారాయణ. బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వలస గిరిజనులకు కులధ్రువీకరణ పత్రాలు

వై.రామవరం: వై.రామవరం మండలం, డొంకరాయి గ్రామంలో తహ సీల్దార్ కె.సుధాకర్ ఆధ్వర్యంలో ఎంపీపీ కడబాల ఆనంద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎగువప్రాంతంలో విశాఖ, విశాఖ సరిహద్దు ప్రాంతం నుంచి పూర్వం వలస వచ్చిన గిరిజనులకు కులధ్రువీకరణ పత్రాలు మంజూరు కోసమే సభ నిర్వహించినట్టు ఎంపీపీ చెప్పారు. వెంకటలక్ష్మి, జోగిరెడ్డి, ప్రసాద రెడ్డి, రమణ, సర్పంచ్ సంధ్యారాణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్‌ఫోన్లు

దేవీపట్నం: అంగన్‌వాడీ టీచర్లకు ఎంపీపీ మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు సత్యవేణి, సర్పంచ్ కృష్ణబాబు శుక్రవారం స్మార్ట్‌ఫోన్‌లు అందజేశారు. వారు మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ

పెదబయలు: పోయిపల్లిం పంచాయతీలో ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన రాజ్‌మా విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు గంజాయికి దూరంగా ఉండాలని, వాణిజ్య పంటలు సాగుచేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

సీలేరు: దుప్పులవాడ పంచాయతీలో ఎస్ఐ రామకృష్ణ రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: పెదవలసలో రైతులకు రాజ్‌మా విత్తనాలను వైస్ ఎంపీపీ ఆనంద్, ఏవో మధుసూదన పంపిణీ చేశారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

అడ్డతీగల: పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరుతూ సరంపేట గ్రామస్తులు అడ్డతీగల ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గంగాభవాని, కృష్ణ,గాంధీ తదితరులున్నారు.

పనులు చేయని కాంట్రాక్టర్లపై కేసులు

చింతపల్లిరూరల్: అడ్వాన్సులు తీసుకుని పనులు చేయని కాంట్రాక్టర్లపై కేసులు పెడతామని ఎంపీడీవో లాలం సీతయ్య అన్నారు. పెదబరడ ఆర్‌బీకే, అంజలి శనివారం సచివాలయం నిర్మాణానికి కాంట్రాక్టర్లు అడ్వాన్సులు తీసుకొని ఇంకా పనులు ప్రారంభించలేదని వారిపై కేసులు నమోదు పెడతామన్నారు.

కాఫీ రైతుల అభివృద్ధే లక్ష్యం

చింతపల్లి రూరల్: గిరిజన కాఫీ రైతుల ఆర్థిక ప్రగతికి తన వంతు కృషిచేస్తానని వాణిజ్య విభాగ కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకర్ అన్నారు. కాఫీ బోర్డు సభ్యుడుని ఆర్.వి.నగర్ కాఫీ పరిశోధన స్థానం డీడీ ఆఫ్ రీసర్చ్ రహిమాన్ , చింతపల్లి కాఫీ బోర్డు జేఎల్‌వో శ్రీరమణ కలిశారు.

నిధుల కోసం వినతి

సాక్షి, పాడేరు: పంచాయతీల్లో అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరుతూ పలువురు సర్పంచ్‌లు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్‌కు వినతి పత్రం అందజేశారు.

పాఠశాల పునరుద్ధరించాలని వినతి

సాక్షి, పాడేరు : 2009లో తమ గ్రామంలో ఎత్తివేసిన ప్రాథమిక పాఠశాలను పునరుద్ధరించాలని కోరుతూ పెదబయలు మండలం బొండాపల్లి గ్రామానికి చెందిన చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు.సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పీవో హామీ ఇచ్చారు.

పథకాలపై అవగాహన

పాడేరు రూరల్: పాడేరులో జరిగిన సన్నాహాక కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రకాష్ రెడ్డి మాట్లాఉడతూ కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.రాజారావు, రామ్‌చందర్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు గాసి

అరకులోయ రూరల్: సుంకరమెట్ట పంచాయతీ పిరిబంధ గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాసి చెప్పారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కేంద్రంలో ఇటీవల ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పర్యటనలో భాగంగా గ్రామస్తులు అంగన్‌వాడీ భవన కోసం విన్నవించారన్నారు. ఈ మేరకు భవనం నిర్మాణానికి రూ.13లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్యే పాల్గుణ ఆదేశాల మేరకు స్థలాన్ని పరిశీలిస్తున్నట్టు చెప్పారు. దీంతో గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వీ ఆర్వో అమ్మలు, నాయకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


జి.కె.వీధి జంక్షన్ వద్ద పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


పాడేరు పాత బస్టాండ్ వద్ద మాట్లాడుతున్న సర్పంచ్ ఉషారాణి



అరకులోయలో ర్యాలీ చేస్తున్న సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు


గంగవరంలోని ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాడేరు రూరల్: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీలో పలు మండలాల్లో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ ర్యాలీ, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి మాట్లాడుతూ ప్రజారోగ్యానికి పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతి వీధిలో ఏర్పాటుచేసిన కుండీల్లోనే చెత్త వేయాలని సూచించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి వరకు పారిశుధ్య కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలన్నారు.పంచాయతీ ఈవో బి.కృష్ణారావు, ఉప సర్పంచ్ రామునాయుడు, సుబ్బారావు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: పెదలబుడు పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, వార్డు సభ్యుడుత్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేష్, ఈవోపీఆర్డీ పాపారావు, కో–ఆప్షన్ సభ్యుడు దావూద్, కార్యదర్శి శ్రీనివాస్, మహిళా పోలీసు శాంతి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచ్‌లు అక్కమ్మ, వెంకటేశ్వర్లు, కార్యదర్శులు, వీఆర్వోలు వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.